'రచన' మాసపత్రిక - డిసెంబర్, 1991

# పొరపాటులో అలవాటు

రోడ్డుకి ఎడమ వైపు నడుస్తున్నాను.

రోడ్డుపై పెద్ద పెద్ద అడుగులతో వడి వడిగా నడుస్తున్నాను. పట్టుదలగా, దీక్షగా ఒక అలవడిన పద్ధతి ప్రకారంగా నడుస్తున్నాను. చిరుచెమటలు పోస్తున్నాయి.

అది పారిశ్రామిక వాడ. పట్టణానికి యిరవై మైళ్ళ దూరంలో ఉన్న ప్రదేశం. అక్కడ కర్షకులు తక్కువ. కార్మికులూ, కాయకష్టం చేసుకు బ్రతికేవారు ఎక్కువ.

నేను నడుస్తున్నది ఉదయం. తెలతెలవారుతున్న సమయం.

అప్పటికే రోడ్డుపై వాహనాల సందడి. జనాల రద్దీ.

నాకప్పుడు కనిపించే దృశ్యం అతి మనోహరం.

జీవనభృతికై పరుగులెట్టే కష్టజీవులు ఆ రోడ్డుపై నిత్యదర్శనం. వాళ్ళ ఉరుకుల పరుగులు ప్రపంచ చైతన్యానికీ, బతుకు పోరుకీ నిదర్శనం.

పీత కష్టాలు పీతవి అన్నట్టు నా కష్టాలు తీరడానికి కూడా ఆ సమయం ఎంచుకున్నాను. రోడ్డుని ఆశ్రయిస్తున్నాను.

మొన్న మొన్నటి వరకు ఉదయం ఏడెనిమిది గంటల వరకూ హాయిగా నిద్రపోయే వాడిని. ఇపుడిలా తెల్లవారుజామున అయిదు గంటలకే లేచి పోయి రోడ్డున పడుతున్నాను. నడుస్తున్నాను.

నిద్ర ఎవరికి మటుకు హాయి కాదు.

నేను బ్రతుకు మీద తీపితో నడుస్తుంటే, ఆ కష్టజీవులు బ్రతుకుతెరువు కోసం పరుగులు తీస్తున్నారు.

వాళ్ళు ఫేక్టరీలలో పని చేయడం ఒక ఎత్తు అయితే.. ఆ ఫేక్టరీలను చేరుకోవడం అంతకు సమానపు ఎత్తు. పట్టణాలలో అద్దెలు భరించలేక... దూరంగా అద్దె తక్కువ ప్రాంతాలలో వుండి.. ఆ ప్రాంతం నుంచి తాము పనిచేసే చోటుకి చేరుకోవడం... అలాగే ఫేక్టరీ నుంచి ఇళ్ళకు చేరుకోగలగడం ఏ రోజు కారోజు అద్భుత విషయమే. ఘనాతి ఘనకార్యమే!

ఆదివారం కొద్దిగ బోసిపోయి వుండే ఈ రోడ్డు మిగతా రోజుల్లో రద్దీగా, చైతన్యవంతంగా కలకల్లాడిపోతుంది.

పరుగులాంటి నడకలూ... సైకిళ్ళూ... మోపెడ్లూ... స్కూటర్లూ... బస్సులూ...లారీలు...

లారీ ఒకటి నా వెనుక నుంచి వచ్చి రాకెట్‌లా ముందుకు దూసుకు పోయింది. లారీ ఇంచుమించు నన్ను రాసుకుని వెళ్ళినంత భ్రమ కలిగింది.

అవును భ్రమే! అదే నిజమయితే నేనిలా వుంటానా? రక్తపు మడుగులో కొట్టుకుంటూ ఉందును.

ఈ లారీలకు ఆదివారం లేదు. రాత్రి లేదు. పగలు లేదు. వాటికి టైము లేదు. అదుపు లేదు. కళ్ళు లేవు. మెల్లగా వెళ్ళలేవు. ఎప్పుడూ అటు ఇటూ పరిగెడుతూనే వుంటాయి. మా స్పీడు మినిమమ్ 80-100 మాత్రమే అంటాయి. వాటికి నిర్మానుష్యపు రోడ్లు. మానుష్యపు రోడ్లూ అనే భేదం లేదు.

వాటిని చూసి మనం తప్పుకోవాలేగాని అవి మాత్రం తప్పుకోవు.

కలకత్తా - మద్రాసు మధ్య ఎన్నో వూళ్ళకూ, మరెన్నో వ్యాపార కేంద్రాలకూ మెటీరియల్‌ని మోసుకుపోవడం, తీసుకురావడంలో నిత్యం అవిశ్రాంతితో అలా తిరుగుతూనే వుంటాయి లారీలు. వాటికి తోడు లోకల్ లారీలు! పురోగమిస్తున్న నగరంలో వాటి డిమాండు.. వాటి స్పీడు... వాటి పొగరూ ఎవరికి తెలియనిది?

ఆ మాటకొస్తే లారీలే కాదు - అన్ని వాహనాలు అలాగే వున్నాయి.

ఈ స్పీడు యుగంలో ప్రతి నిముషం మహా అర్జంటు. ప్రతి క్షణం యమా అర్జంటర్జెంట్. ఎవరు కోసం ఎవరూ ఆగరు. దేనికోసం ఏదీ ఆగదు. ఆగడం కుదరదు. కుదరడానికి వీలు లేదు. టైము లేదు. క్షణాల్లో మనం అనుకున్న చోటికి - అవతలవాడి ప్రాణాల మీంచైనా సరే అమాంతంగా చేరిపోవాలి.

పదేళ్ళ కిందట ఈ స్పాట్‌లో నిముషానికి పది వాహనాలు తిరిగితే - యిపుడు కనీసం వంద వాహనాలు కనిపిస్తాయి. రోడ్లు మాత్రం అపుడూ ఇప్పుడూ అలానే వున్నాయి - ఎదుగుదల లేకుండా, ఇరుకు ఇరుకుగా.

ఆ యిరుకు రోడ్ల మీదే వాహనాలతో బాటు పాదచారులూ వెళ్ళాలి. వాళ్ళ కోసం ఫుట్‌పాత్‌లు వుండవు. నగరంలో మెయిన్ రోడ్లపై ఫుట్‌పాత్‌లు వున్నట్టు కనిపించినా అవి పేరుకు మాత్రమే వుంటాయి. అవి నడవడానికి వీలులేకుండా చిల్లర వర్తకులకు నిలయమై - పోలీసుల జేబులని నింపుతుంటాయి.

అంచేత ఫుట్‌పాత్ కల్చరులేని మన రోడ్లపై నడిచేటప్పుడు జాగర్తలు నీవి. వాహనాలకి ఏ మాత్రం సంబంధం లేదు - అప్పుడప్పుడు జనాలను ముద్దుపెట్టుకోవడం తప్ప!

రోడ్డుకి ఎడమ వేపు రోడ్డు అంచున బుద్ధిగా నడుస్తున్న నన్ను రాసుకున్నంత దగ్గరొంచి లారీ దూసుకుపోయిందే! ఒక్క అంగుళం అటూ ఇటూ అయితే ఏమయివుండేవాడిని? నాకేదీ రక్షణ? నేనేం తాగి అడ్డదిడ్డంగా నడవడం లేదే? రోడ్డు రూల్సుకి వ్యతిరేకంగా పోవడం లేదే?

ఇలాంటి సంఘటనలు నిత్యజీవితంలో మామూలు అయిపోవడంతో - భగవంతుడికో

నమస్కారం పెట్టి అలానే సాగిపోతున్నాడు మానవుడు. ఏం చేస్తాడు మరి!

నా విషయానికొస్తే -

నేను నా ఉద్యోగానికి నడిచి కాదు - కారు మీద వెళ్ళగల శక్తిమంతుడను. నాకు మారుతీ కారు వుంది. మానేజరు స్థాయి ఉన్నత ఉద్యోగం వుంది. ఏడెనిమిది వేల జీతం వస్తుంది. ఈ రోడ్డుని అనుకునే విశాలమైన సొంత ఇల్లు ఉంది. రోగం లేని భార్య. మెడిసిన్ చదువుతున్న కూతురూ, ఇంజనీరింగ్‌కి అపియర్ అవుతున్న కొడుకూ వున్నారు.

అంతవరకూ బాగానే వుంది

బాగోలేనిదల్లా నా గ్రహచారం.

ఈ మధ్య నాకు మనస్తాపం కలిగే వ్యవహారం జరిగింది. దాని వల్ల నా ఆరోగ్యం చెడింది.

నా కారు కండిషన్‌లోఉన్నప్పటికీ - నా ఆరోగ్యం కండిషన్‌లో లేదు కాబట్టి కారుని పక్కన పెట్టి కాళ్ళతో నడవమన్నాడు డాక్టరు. ఉదయం, సాయంత్రం వీలైనంత దూరం నడవమన్నాడు. అలా నడవకపోతే రక్తపు పోటు, మధుమేహం, హృద్రోగం వగైరాలు నన్నిక బతుకుబాటలో సాగనీయకుండా ఏక్సిడెంట్ చేస్తాయని డాక్టరు హెచ్చరించడంతో-

నేనిలా ఉదయం నడుస్తున్నాను.

చేతులు బారుగా ఊపుతూ, అడుగులు వడివడిగా వేస్తూ నడుస్తున్నాను.

అప్రమత్తంగా, జాగర్తగా నడుస్తున్నాను.

ఎదురుగా వస్తున్నది లారీ కాదు.

సాంబమూర్తి.

లారీని చూస్తే నాకెంత హడలో వీడిని చూస్తే నాకంత కంపరం.

ఒళ్ళు మండిపోతుంది.

రోడ్డుకి అటువేపు... ఎడమ వేపు ఏడ్వవచ్చుకదా.

అలా ఏడ్వడు. నన్ను ఏడిపించడానికి నా పక్కనుంచి వస్తాడు. నన్ను వెర్రెక్కించడానికి, బీపీని రైజ్ చేయడానికి వస్తాడు.

వాడు నా తోవలో ఎదురవ్వడం వల్లే నేనిపుడు సుఖశాంతులు కోల్పోయాను. అనారోగ్యం పాలయ్యేను.

ఇంతకాలం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిన నా జీవిత రథం గతుకుల్లో పడింది. పాతికేళ్ళుగా నేను చేస్తున్న ఉద్యోగం నుంచి పొందిన తృప్తి మంటగలిసి పోయింది.

ఆఫీసులో వాడి ఉనికి భరించలేకపోతుంటే - ఈ ప్రశాంత వాతావరణంలో కూడా దాపురిస్తున్నాడు వెధవ!

ఎలా భరించాలి వీడిని? ఎలా అణుచుకోవాలి నాలో టెన్షన్‌ని?

సాంబమూర్తి నేను మొన్నమొన్నటి వరకూ మిత్రులం కాకపోయినా శత్రువులం కాదు.

ఒకే గ్రేడ్‌లో వున్న కొలిగ్స్‌మి.

గత ఏడాది వరకూ ఇద్దరం మానేజరు గ్రేడులో వున్నాం. ఆ గ్రేడులో నేను వాడికన్నా సీనియర్‌ని.

జరిగిన ఘోరం ఏమిటంటే –

గత ఏడాది ప్రమోషన్లు డిక్లేర్ చేసినపుడు సాంబమూర్తికి ప్రమోషన్ వచ్చి సీనియర్ మానేజర్ అయేడు. నేను వాడికన్నా సీనియర్‌ని అయినప్పటికీ అలా మానేజర్‌గానే మిగిలిపోయేను –

ప్రమోషన్ రాలేదనే బాధ గుండెల్ని పిండి చేసినా, మతిని చెదరగొట్టినా ఒకటీ రెండు నెలల్లో ఆ గాయం క్రమంగా మానిపోతుంది. డ్యూటీ ధ్యాసలోపడి ఆ బాధను మర్చిపోతాం.

నాకు దిగ్భ్రాంతినీ, గుండెల్లో బాధనీ కలిగించిన విషయం ఏమిటంటే సాంబమూర్తికి ప్రమోషన్ యిచ్చి వాడిని నా పై అధికారిగా నియమించడం!

అంటే నేను వాడి కంట్రోల్‌లో వుండాలి. రోజూ వాడికి రిపోర్టు చేయాలి. వాడు చెప్పిన పనులు చేయాలి.

నిన్నటి వరకూ నా గ్రేడ్‌లో వున్నవాడిని – ఆ గ్రేడ్‌లో నాకన్నా జూనియర్‌ని – అప్‌గ్రేడ్ చేసి వాడు నీకు బాస్ అంటే అది భరించడమెలా సాధ్యం? నేనెలా తట్టుకోగలను?

మానేజ్‌మెంట్‌కి నా సర్వీసు యిష్టం లేకుంటే – ఏ అండమానుకో ట్రాన్స్‌ఫర్ చేసేసినా బాధపడేవాడిని కాదు.

ఆఫీసు ఆర్డరు వచ్చినా, నేను మాత్రం సాంబమూర్తికి రిపోర్టు చేయలేదు. పై నుంచి ఎంత వత్తిడి వచ్చినా సరే – ఈ వెధవ ఉద్యోగం మానైనా మానేస్తాను తప్ప వాడికి మాత్రం రిపోర్టు చేసేది లేదు గాక లేదు – అని ఆనాడే తీర్మానించేసుకున్నాను.

నాకు బాస్‌గా వచ్చి ఏడాది కావొస్తున్నా ఈ రోజు వరకూ వాడికి నేను రిపోర్ట్ చేయలేదు. వాడి కేబిన్‌కి వెళ్ళలేదు. మొదట్లో నాలుగైదుసార్లు మెసెంజర్‌తో నన్ను రమ్మని కబురు పెట్టేడు. వెళ్ళలేదు. ఫోనులో పిలిచేడు. వెళ్ళలేదు. ఆఫీసు పేపర్లపై 'ప్లీజ్ స్పీక్' అని రాసినా నేను వెళ్ళి స్పీకలేదు.

చెప్పాలంటే క్రమశిక్షణనీ, కంపెనీ నియమనిబంధనలనీ నేను ఉల్లంఘించినట్టే! అయితే ఏమాట కామాటే చెప్పుకోవాలి. సాంబమూర్తి నాపై రెచ్చిపోలేదు. నాతో గొడవ పెట్టుకోలేదు. పై అధికారులకు నాపై వ్యతిరేకంగా రిపోర్టు చేయలేదు. వాడికా ధైర్యం ఎక్కడిదీ? గిల్టీ!

కేవలం ప్రమోషన్‌తో సాంబమూర్తి నాకు బాస్ అయిపోతాడా? నేనింత కాలం ఫెయిత్‌ఫుల్‌గా కంపెనీకి చేసిన పాతికేళ్ళ సర్వీస్‌ని గుర్తించి యాజమాన్యం నాకిచ్చిన బహుమతి ఇదా? నేను పై అధికార్ల వద్దకు వెళ్ళి నా నిరసన తెలియజేసి ట్రాన్స్‌ఫర్ కోరుదామనుకున్నాను. అదీ నాకు యిష్టం లేకపోయింది.

ఎందుకు నేనడగాలి?

నన్ను సాంబమూర్తికి రిపోర్టు చేయమని ఆర్డరు జారీ చేయక ముందే పెద్ద అధికారులకు ఇంగిత జ్ఞానం ఏడవాలి. బుద్ధీ బుర్ర వుండాలి. 'ఇది చాలా అన్యాయం' అని అడిగితే అన్యాయం కాదంటూ వాళ్ళ చర్యను సమర్థించుకుంటారు తప్పా జారీ చేసిన ఆఫీసు ఆర్డరు విత్‌డ్రా చేసుకోరు. పైగా మొండితనం, మూర్ఖత్వం ప్రదర్శిస్తారు. అవసరమైతే పెంకిగా పట్టుదలకి పోయి ఆర్గనైజేషన్ ఇంట్రెస్టునే కాలదన్ని సబ్జెక్టివ్‌గా దిగిపోతారు. మావాళ్ళ సంగతి నాకు తెలియన్దేముంది?

ప్రస్తుతం యాజమాన్యం దృష్టిలో నేను సాంబమూర్తి కింద పని చేస్తున్నట్టే లెక్క. ప్రాక్టీకల్‌గా మాత్రం నేను వాడి కింద పని చేయడం లేదు. గతంలో ఏ విధులు నిర్వహించే వాడినో - అదే పని యిపుడు యధావిధిగా చేసుకుపోతున్నాను. కంపెనీ జీతం అంటూ తీసుకుంటున్నాక - పని చేయాలి గదా!

సాంబమూర్తి ఏదైనా అవసరం అయితే - నాకింద లెవెల్ వాళ్ళను పిలిచి ప్రోగ్రెస్ తెల్సుకుంటున్నాడు. పని చేయించుకుంటున్నాడు. అవసరమైనపుడూ, తప్పనపుడూ నాకు ఫోన్ చేసి అడుగుతున్నాడు. నేను సమాధానం ముక్తసరిగా చెప్పి ఫోను ధడేలున పెట్టేస్తున్నాను.

మొత్తానికి నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. నా శరీరంలో నరాలు తెగిపోయే టంత టెన్షన్‌కి గురికాబడ్డాను. నాకు కొద్దిగా వుండే బీపీ బాగా రైజయిపోయింది. మూడు పూటలూ మాత్రలు మింగుతూ - రాత్రి కంపోజ్ వేసుకోక పోతే నిద్ర పట్టడం లేదు. నిద్ర పడితే కలలో కూడా వీడే కనిపిస్తున్నాడు. ఏం చేయాలి?

యాజమాన్యం తోటి అధికారిని అవమానించిందనే భావన నన్ను ఆక్రమించి చిత్రవధ చేసేది. మనసుని తూట్లు పొడిచేది. చివరికి అది నన్ను హార్టు అటాక్‌కి దారి తీయించింది. ఇంట్లోవాళ్ళు సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్ళడం చేత బతికిపోయేను. లేకుంటే వీడి పేరు చెప్పుకొని అప్పుడే చచ్చేదును.

ఆ తర్వాతే నేను డాక్టరు అద్వయిజు ప్రకారం మోర్నింగ్ వాక్ మొదలెట్టేను.

సాంబమూర్తి కూడా మోర్నింగ్ వాక్ చేస్తున్నాడనే సంగతి - నేను చేస్తుండగా, చూడగా తెలిసింది.

వీడికేం తెగులు?

రోగం రాకుండా ముందు జాగర్తా?

డిపార్టుమెంట్‌లో వాడి ఉనికి నేను సహించలేకపోతుంటే - ఇక్కడ కూడా ప్రత్యక్షం!

నాకు ఎప్పుడూ ఎదురవుతూ వుంటాడు. నవ్వుతూ పలకరించబోతాడు. నేను నవ్వను. మాటాడను. ఆగను. అందుకు అవకాశం ఇవ్వను. మొహం ఆ క్షణం పక్కకి తిప్పేస్తాను.

ఒకరోజు -

వాడి తోవన వాడు వెళ్ళకుండా వాడి చేతికర్రతో నన్ను ఆపేడు. నలభై ఆరేళ్ళ వయసులో, లావుగా దున్నపోతులా వుంటాడు. మోర్నింగ్ వాక్ సమయంలో చేతిలో చిన్న లాటీ వేసుకు

తిరుగుతాడు. అదొక స్టయిల్ గాబోలు!

చేతి కర్రతో ఆపి నన్ను పలకరించేడు సాంబమూర్తి.

నాకు చెడ్డకోపం వచ్చింది. ఆ కర్రని లాక్కొని వాడి నెత్తిమీద దబదబా మోదాలని పించింది.

"మీరు అటు వేపు నడవడం మంచిది" అని రోడ్డు కుడివేపు చూపించేడు.

అటు నడవవలసింది వాడు! నన్ను నడవమంటున్నాడు!

నా రూట్‌లోకి చొరబడి - అవతల రూట్‌కి వెళ్ళమని కర్ర చూపిస్తున్నాడు.

ఏం చేయాలి వాడిని?

"మీ అధికారం చెల్లడానికి ఇది ఆఫీసు కాదు. రోడ్డు. ప్లీజ్ మైండ్ ఇట్!" - ఆఫీసులోనే వాడిని నేను ఖాతరు చేయడం లేదు!

"మీ పై అధికారిగా మాటాడడం లేదు. మీ క్షేమం కోరి..... అటువయిపు నడవమంటు న్నాను"

నా క్షేమం కోరిన వాడివా? నా క్షేమం కోరిన వాళ్ళయితే నన్నీస్థితికి తీసుకువస్తారా. నీవూ, నీ యాజమాన్యం?

"ఈ రోడ్డు మీ బాబుగారి సొత్తులా మాట్లాడుతున్నారేవిటీ? ఏమిటసలు మీ ఉద్దేశం? అడ్డ తోవలూ, రాంగ్ రూట్లూ మీవి.. నాకా ఖర్మ పట్టలేదు. ఎలా నడవాలో, ఎటువైపు నడవాలో నాకు తెలుసు. ఐ నో హౌ టు వాక్. అండ్ విత్ హూమ్ టూ టాక్."

"ప్లీజ్! లిజన్ టు మీ... కుడివైపు నడవడం వల్ల..." - ఏదో చెప్పబోతున్నాడు.

"సారీ. ఐ డోంట్ వాంట్ టూ లిజన్ ఎనీథింగ్ ఫ్రం యూ" అని విసురుగా వెళ్ళి పోయాను.

నేను ట్రాఫిక్ రూల్స్ ప్రకారం ఎడమ వేపు నడుస్తున్నాను. వాడు అక్రమంగా కుడి వేపు నడవడం కాకుండా - నన్ను కూడా నడవమంటున్నాడు.

ఒకటయి వుండాలి.

ముందు నన్నిక్కడ టెస్టు చేస్తున్నాడు. ఇక్కడ వాడు చెప్పినట్టు వింటే నెమ్మదిగా ఆఫీసులో నాపై జులుం చేద్దామని ప్లాను.

నడుస్తున్నాను.

ప్రతి రోజూ ఉదయం నడుస్తూనే వున్నాను.

నడవడం ఇష్టంగా కూడా మారింది.

నడుస్తుండడం చేత ప్రపంచాన్ని దగ్గరిగా, స్పష్టంగా చూడగలుగుతున్నాను. చూసి ఆనందం అనుభవించగలుగుతున్నాను.

కంపెనీలో పగలంతా చాకిరి. ఆ తర్వాత యింట్లో పెళ్ళాం, పిల్లలతో సామాన్య, రొటీన్ సంసార జీవితం. బయటకువెళితే కారు. ఇన్నాళ్ళుగా మిగతా ప్రపంచంతో సంబంధమే తెగిపోయింది. బొత్తిగా బతుకు యాంత్రిక జీవనం అయిపోయింది.

రోజూ ఉదయం ఇలా నడుస్తూ వుంటే -

నాకీ ప్రపంచం అపురూపంగా, చైతన్యవంతంగా, అందంగా కన్పిస్తున్నది.

అలా కనిపించడం రాగరంజితమైన ఉషోదయాన్ని చూసి కాదు. బద్ధకం విదిలించుకుంటూ తొలిగిపోతున్న పలచని మంచుతెరని చూసి కాదు. పక్షుల కిలకిల రావాలూ, మలయ పవన వీచికలూ, వినీల ఆకాశం, తేలియాడే తెల్లని మబ్బుల శకలాలు - శోభాయమానంగా ప్రకాశించిపోతున్న ప్రకృతి అందాలను చూసి మాత్రం కాదు.... కాదు.

అదిగో ప్రపంచాన్ని నడిపిస్తున్న... ఆ కార్మికులూ, ఉద్యోగులూ. చిన్ని చిన్ని వ్యాపారస్థులూ, నెత్తిపై తట్టలూ, చేతుల్లో కారేజులూ.. నోట్లో చుట్టలూ, పరుగు లాంటి నడకలూ, వడివడిగా పరుగులూ...అసహనంగా ఆశగా గుంపులుగా సైకిళ్ళూ - మోపెడ్లూ.... స్కూటర్లూ.. కంపెనీలకు నిర్ణీత సమయంలో చేరుకోవాలనే ఆరాటం, ఆతురత, తపన, లక్ష్యం మూర్తీభవించిన మానవ సముదాయం... వాళ్ళ మేనరిజమ్స్... ఆ శ్రమైక జీవన సౌందర్యం... చూస్తుంటే నాకు కన్నుల పండుగగా ఉంటుంది.

నన్నెంతగానో ఆ దృశ్యం ఆనంద పరుస్తుంది. ఆహ్లాద పరుస్తుంది. కదిలిస్తుంది. హుషారుగా నన్ను ముందుకు ఎంత దూరమైనా నడిపిస్తున్నది.

నడుస్తున్నాను.

హుషారుగా నడుస్తున్నాను.

నా ఆనందానికి అవరోధం కలిగిస్తూ... సాంబమూర్తి మళ్ళీ ఎదురు!

రోజూ ఈ తద్దినం తప్పదు.

వాడిని నెమ్మదిగా దాటుకొని వెళ్ళాలి.

సాంబమూర్తి పది గజాల దూరంలో వుండి వుంటాడు.

వాడు సడన్‌గా, గట్టిగా అరవడం మొదలెట్టాడు.

ఆ గావుకేక నాకు అర్థమయి తప్పుకునే లోపున నన్ను బస్సు గుద్దేసింది.

కాళ్ళకీ, చేయికీ బలమైన గాయాలు తగిలేయి. అదృష్టం. నా తల చక్రాల కింద పడి, కపాలం చిట్లి, మెదడు తుళ్లి భయంకరమైన చావు చావకుండా తప్పించుకున్నాను. సాంబమూర్తి కేకకు ఆ కొద్ది సమయంలోనే అలెర్టు అవ్వడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.

సాంబమూర్తి నన్ను వెంటనే ఆసుపత్రిలో జాయిన్ చేశాడు. నాకు సరైన వైద్యం అందేవరకూ అక్కడే ఆ రోజంతా వుండిపోయాడు.

కుడి చేతికీ, ఎడమ కాలుకీ పిండికట్టుతో మంచమెక్కాను.

ఆసుపత్రికి వీలైనప్పుడల్లా వస్తున్నాడు సాంబమూర్తి.

'మీరు నాకేం సాయం చేయక్కర్లేదు. వెళ్ళండి' అనలేకపోయేను. అంతేకాదు - కళ్ళు చెమరుస్తుండగా కృతజ్ఞతలు హృదయపూర్వకంగా తెలుపుకోకుండా వుండలేక పోయాను.

ఆ రోజు నన్ను కుడి వైపు ఎందుకు నడవమన్నదీ వివరంగా చెప్పాడు. నీవు నాకు చెప్పక్కర్లేదు - అనకుండా బుద్ధిగా విన్నాను. దెబ్బ తింటే గాని బుద్ధి రాదు!

నన్ను ఆసుపత్రి నుంచి డిశ్చార్చి చేస్తారనగా ఆ రోజు ఎంతో ఉత్సాహంగా వచ్చేడు సాంబమూర్తి. రాగానే "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు. అతని చేతిలో కాగితం ఉంది.

విషయం ఏమిటని అడిగేను.

"బాబూ! మీరు నాకిక రిపోర్టు చేయక్కర్లేదు. మీ ఆరోగ్యం పాడు చేసుకో అక్కర్లేదు"

"క్షమించు సాంబమూర్తీ. నా అహానికీ, నీచ ప్రవర్తనకీ క్షమించు. మానేజుమెంటు ప్రవర్తన నన్ను గాయపరిచింది. ఆ కోపంలో, బాధలో అనవసరంగా, అన్యాయంగా నీపై విరుచుకు పడ్డాను. ఇపుడదేమీ లేదు.. మీ కంట్రోల్‌లో పనిచేయడానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను... రియల్లీ."

"థాంక్యూవెరీమచ్! మీ పరిస్థితి, మీ మానసిక స్థితి నేను అర్థం చేసుకోగలను - చేసుకున్నాను కూడా.. అంచేతనే మీరు ఇన్నాళ్ళు నా పట్ల నెగెటివ్‌గా బిహేవ్ చేసినా నాకేం కోపం లేదు. ఇంతకీ కంగ్రాట్స్ చెబుతున్నదెందుకో తెల్సా?"

"దేనికీ?"

"యూ ఆర్ ప్రమోటెడ్! నవ్ యూ ఆర్ ఎ సీనియర్ మానేజర్. మిమ్మల్ని ఆ డిపార్టుమెంట్‌కి హెడ్‌ను చేసి నన్ను కమర్షియల్ డిపార్టుమెంట్‌కి ట్రాన్సఫర్ చేశారు. వన్స్ ఎగైన్ కంగ్రాచ్యులేషన్స్" అంటూ ఆర్డరు నా చేతికి అందించేడు.

ప్రమోషన్ వచ్చి డిపార్టుమెంట్ హెడ్‌ని అయినందుకు ఎంత సంతోషించానో - ఇన్నాళ్ళుగా సాంబమూర్తి పట్ల నా అల్ప ప్రవర్తనకి అంత సిగ్గు పడ్డాను.

❁ ❁ ❁

నా ఆరోగ్యం బాగుంది.

అలాన్చెప్పి మోర్నింగ్ వాక్‌కి తిలోదకాలు చెప్పలేదు.

రోజూ మోర్నింగ్ వాక్ చేస్తున్నాను.

తెల్లవారుఝామున. ఆ శ్రమజీవుల శ్రమైక జీవన సౌందర్యం చూస్తూ నడవడం నాకు యిష్టం.

అంతేకాదు. మళ్ళీ ఏ లారీయో, బస్సో వెనుక నుంచి వచ్చి గుద్దేస్తుందేమోననే భయం కూడా లేదు.

ఇపుడు వాహనాలు నా వెనుక నుంచి రావడం లేదు. ఎదురుగ్గా వస్తున్నాయి. అంచేత జాగర్తగా తప్పుకుంటూ, చూసుకుంటూ నడుస్తున్నాను.

సాంబమూర్తి కూడా మోర్నింగ్ వాక్ చేస్తున్నాడు. నాకు ఎదురు అవ్వడం లేదు. అతను చూపిన బాటలో నడుస్తున్నాను. అనగా - ఇద్దరం కలసీ కుడి వైపున నడుస్తున్నాము.

పుట్‌పాత్‌లూ, రోడ్ కల్చరూ లేని ఈ దేశంలో రోడ్డు మీద నడవక తప్పని వారు ఎడమ వైపు కాకుండా, కుడి వైపు నుంచి నడిస్తే కొంత కాలం బతికే అవకాశం వుందని సాంబమూర్తి నాకు చెప్పడమే కాదు - మీ అందరికీ చెప్పమంటున్నాడు.

చెప్పాను. తర్వాత మీ యిష్టం! ❁